## తెలంగాణ తల్లి విగ్రహం ముస్తాబు

### స్వయంగా కలర్ వేసిన జడ్పీ కో ఆప్షన్ మాజీ మెంబర్



బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మహబూబ్ పాషా

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జిల్లాలో కార్యకర్తలు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యుడు మహబూబ్ పాషా తెలంగాణ తల్లి విగ్రహం, పార్టీ గద్దెను శుభ్రం చేసి గులాబీ రంగు కలర్ వేసి కేసీఆర్ పేరు రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలు విసుగు చెందారని, ఎక్కడ చూసినా సీఎం రేవంత్‌రెడ్డిపై రైతులు ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల నుంచి చాలామంది స్వచ్ఛందంగా ఎల్కతుర్తి సభకు తరలిరావడానికి సిద్ధమవుతున్నారని అన్నారు.



పైపులైన్ కోసం జగ్గుతండా మంచినీటి బావిని పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాస్

## తాగునీటి సమస్య లేకుండా చూస్తాం.

- 'నమస్తే తెలంగాణ' కథనంతో బయ్యారంలో తాగునీటి బావిని పరిశీలించిన డీఈ శ్రీనివాస్
- పైపులైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడి

బయ్యారం, ఏప్రిల్ 25 : మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ తెలిపారు. నీరు లేక బయ్యారం ప్రజలు అల్లాడుతున్న తీరుపై 'బయ్యారంలో నీటి కష్టాలు' అనే శీర్షికతో శుక్రవారం నమస్తే తెలంగాణ దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన డీఈ నీటి సమస్యను పరిష్కరించేందుకు జగ్గుతండాలోని తాగునీటి బావి, మండలంలోని ఇర్సులాపురం, వినోభానగర్‌లో నీటి వనరులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో భగీరథ పైపు లీకేజ్ కారణంగా బయ్యారం, గార్ల మండలాలకు భగీరథ నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందన్నారు. గ్రామాల్లోని బావుల ద్వారా ప్రజలకు నీరందిస్తున్నట్లు తెలిపారు. బయ్యారంలోని వ్యవసాయ గోదాంలో ఉన్న ట్యాంకుకు తాగునీటిబావి నుంచి పైపులైన్ కనెక్షన్ లేకపోవడంతో కొన్ని వీధుల్లో నీటి సమస్య తలెత్తిందని, పైపులైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. అదేవిధంగా ఇర్సులాపురం, భీమ్లాతండా గ్రామాల్లో కూడా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు. భగీరథ నీరు సరఫరా అయ్యే వరకు నీటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టామని తెలిపారు.

## జాతరను విజయవంతం చేయాలి



మాకుల వేంకటేశ్వర స్వామి ఆలయం (ఫైల్)

మరిపెడ : శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పారువేటను భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ ఈవో వేణుగోపాల్ కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. జాతరలో జరిపే స్వామివారి పారువేట అత్యంత మైన ఘట్టమన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సమ్మర్ స్పెషల్ ఆఫర్**
★శ్రీ శైలి బ్యూటీ పార్లర్ Only అడ్మిషన్ ఫీ 2,000/- with సర్టిఫికెట్ ఫ్రీ, బ్యూటీషన్, మగ్గం వర్క్ కోర్స్ నేర్పించబడును. వెంటనే సంప్ర: Call Me: 9989060668.
NTW-15698

**WANTED**
★MS Office & Multimedia Teaching చేయుటకు Trainer (Full Time / Part Time) కావలెను. Monthly Salary Rs. 15,000/-. Vidyarthi Computers. Cell: 6309013619
NTW-6586

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565




తొర్రూరు: మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



డోర్నకల్: చిల్కోడులో గోడలకు వాల్ పోస్టర్లు అతికిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# వేలాదిగా తరలిరావాలి

- బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- 16నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యం
- సర్వేలన్నీ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా వచ్చాయి
- తొర్రూరులో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి..

తొర్రూరు, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పే సభగా మారనున్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ అన్నారు. సభను విజయవంతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు ఊరూరా, వాడవాడల నుంచి కదలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం తొర్రూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయారని, ఇప్పుడు రాష్ట్రానికి మళ్లీ బీఆర్ఎస్ అవసరమని చెప్పే సమయం వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో గొప్పగొప్ప హామీలు ఇచ్చిన కాంగ్రెస్.., అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. రైతుబీమా, రైతుబంధు, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్ పెంపును నిలిపివేసి, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిందన్నారు. తొర్రూరు మండలంలోని 29 గ్రామాలు, పట్టణం నుంచి కనీసం 10వేల మంది సభకు తరలివస్తారని, బీఆర్ఎస్ బలం ఏమిటో.., కాంగ్రెస్ బలహీనత ఏమిటో చాటుతామన్నారు. కేసీఆర్ హయాం లో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లిందని, కానీ ఇప్పుడు ప్రతి వర్గానికీ తీవ్ర నిరాశే మిగిలిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఎల్కతుర్తి సభ అం దుకు నాంది పలకనుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ తూర్పాటి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు బిందూశ్రీనివాస్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, పార్టీ కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఎన్నమనేని శ్రీనివాసరావు, మణిరాజు, తూర్పాటి రవి, శంకర్, జైసింగ్, అంకూస్, కాలూనాయక్, వెంకన్న, జాటోత్ స్వామి, భాస్కర్, సోమలింగం పాల్గొన్నారు.

### విజయవంతం చేయాలి

డోర్నకల్, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు రాయల నరేశ్ అన్నారు. శుక్రవారం చిల్కోడు గ్రామంలో సభ వాల్‌పోస్టర్లను గోడలకు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేసీఆర్ తన పదేళ్ల పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిచారని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నూకల ఉపేందర్, బీఆర్ఎస్ నాయకులు రాజు పాల్గొన్నారు.

### ఇంటింటి ప్రచారం

నర్సింహులపేట : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరుతూ శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మండలవ్యాప్తంగా వాల్ పోస్టర్లు అంటించడంతోపాటు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ హామీలను నమ్మి అధికారం ఇస్తే ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు రవి, మధు, వెంకన్న, వెంకటేశ్వర్లు, రామన్న, సోమన్న, రవీందర్‌రెడ్డి, జంపన్న, వీరన్న, పృథ్వీ, రాంబాబు పాల్గొన్నారు.

### ఇంటిల్లిపాది సభకు తరలిరావాలి..

పెద్దవంగర: ఇంటిల్లిపాది 27న చలో వరంగల్ సభకు దండులా కదలి రావాలని బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలుక భిక్షపతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభు త్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు.



నర్సింహులపేట: ఫకీరతండాలో వాల్ పోస్టర్ అంటిస్తున్న మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రవి



పెద్దవంగర: ఇంటింటికీ తిరిగి సభకు ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భిక్షపతి



ఆర్యవైశ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

## ఆర్యవైశ్య కార్యవర్గ ప్రమాణ స్వీకారం

మరిపెడ : జిల్లా నూతన ఆర్యవైశ్య కార్యవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం పురపాలక సంఘం పరిధిలోని భార్గవ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఆర్యవైశ్య రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ సంఘం నూతన జిల్లా అధ్యక్షుడు తల్లాడ వెంకటరామరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మేమిశెట్టి కిశోర్‌కుమార్, జిల్లా కోశాధికారిగా సామ రామ్మూర్తి, సభ్యులతో, ఆర్యవైశ్య మరిపెడ మండల అధ్యక్షుడిగా తిపిరిశెట్టి గోవర్ధన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా తల్లాడ సురేశ్, కోశాధికారి బుద్ద శ్రీనివాస్‌తో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్, హకా మాజీ చైర్మన్ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వీరన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ముళ్ల కంపలను తొలగించాలి

నెల్లికుదురు, ఏప్రిల్ 25 : రోడ్డు వెంట ఉన్న ముళ్ల కంపలను తొలగించాలని ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు యాసం వెంకన్న అధికారులను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని నైనాల గ్రామంలో నైనాల గ్రామ పంచాయతీ నుంచి మాల బజార్ మీదుగా పార్వతమ్మగూడేనికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ముళ్ల కంపలు దట్టంగా పెరిగాయని, తక్షణమే వాటిని తొలగించాలన్నారు. మాల బజార్‌లో విద్యుత్‌దీపాలు లేక అక్కడి ప్రజలు అంధకారం మగ్గుతున్నారని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వంగ భిక్షం, ఆకుల బక్కులు, ఉప్పలయ్య పాల్గొన్నారు.

## నలుగురిపై బ్రీచ్ కేసు నమోదు

తొర్రూరు, ఏప్రిల్ 25 : గుడుంబా దాడుల్లో పట్టుబడిన నిందితులపై బ్రీచ్ కేస్ నమోదు చేసినట్లు తొర్రూరు ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ రాజేశునిప్రవీణ్ తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మాట్లాడుతూ.. గుడుంబా దాడుల్లో పట్టుబడిన నెల్లికుదురు మండలానికి చెందిన భూక్యా నీలమ్మ, గుగులోత్ గోరు, భూక్యా సరితతోపాటు మరొకరిపై బ్రీచ్ కేస్ నమోదు చేసి, ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు.

## క్రషర్ తవ్వకాలు నిలిపి వేయాలని రాస్తారోకో

నెల్లికుదురు, ఏప్రిల్ 25 : మండలంలోని నల్లగుట్ట తండా గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్టోన్ క్రషర్ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలనే డిమాండ్‌తో నల్లగుట్ట తండావాసులు శుక్రవారం రాత్రి కేసముద్రం-తొర్రూరు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో రోడ్డుపై వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తండావాసులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింప చేశారు. అనంతరం తండావాసులు నెల్లికుదురు పోలీసు స్టేషన్‌లో స్టోన్ క్రషర్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తండావాసులు గుగులోత్ హచ్చునాయక్, వెంకన్న, శ్రీను మాట్లాడుతూ.. వేంకటేశ్వర స్టోన్ క్రషర్ యాజమాన్యం దాదాపుగా రాత్రి 8 గంటల సమయంలో బాంబులతో బ్లాస్టింగ్ చేశారని దీంతో భూకంపం తలపించినట్లుగా ఇండ్లు అదిరాయన్నారు. నల్లగుట్టతండాతోపాటు బోజ్యాతండా, బాలాజీ తండా, సాపావత్ తండా, జాదు తండా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన బ్లాస్టింగ్, క్రషర్ తవ్వకాలను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తండావాసులు గుగులోత్ మోహన్, కల్యాణ్, భీముడు, రవి పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్ : నల్లబ్యాడ్జీలతో ముస్లింలు



తొర్రూరు: అమరవీరులస్తూపం వద్ద ఉపాధ్యాయ సంఘాలు



మరిపెడ: నిరసన తెలుపుతున్న ముస్లింలు

# నల్ల బ్యాడ్జీలతో ముస్లింల నిరసన

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 25 : ఉగ్రవాదులు భారతీయుల మనోధైర్యాన్ని దెబ్బ తీయలేరని జిల్లా వక్ఫ్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. కశ్మీర్‌లో జరిగిన దాడులకు వ్యతిరేకంగా శుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో భాగమని, అది దేశ కిరీటమన్నారు. దేశ నలుమూలలా ఉగ్రవాదాన్ని అంతం చేయాలన్నారు. అనంతరం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, ఇమాముద్దీన్, జానీ, రహీం, యూసుఫ్, ఇబ్రహీం, ఖాసీం పాల్గొన్నారు.

### మరిపెడలో..

మరిపెడ, ఏప్రిల్ 25 : ఉగ్రదాడిలో మృతిచెందిన కుటుంబాలకు సంఘీభావంగా శక్రవారం పురపాలక సంఘం పరిధిలోని మజీదే రెహమాన్య హౌసింగ్ బోర్డు సీతారాంపురం మసీదులో ముస్లింలు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ పెద్దలు మాట్లాడుతూ.. శాంతికి చిహ్నమైన ఇస్లాం ఇలాంటి దాడులకు వ్యతిరేకమన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ సర్వర్, ఉపాధ్యక్షులు షేక్ యాకూబ్ పాషా, అప్సర్, సయ్యద్ లతీఫ్, జహంగీర్ సాబ్ సయ్యద్ అవేజ్, హమీద్, ఫయాజ్ ఖాన్ పాల్గొన్నారు.

### నర్సింహులపేటలో..

నర్సింహులపేట : పహల్గామ్ దాడిని ఖండిస్తూ శుక్రవారం ముస్లింలు నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఉగ్రదాడి విషాదకరమన్నారు. మతం ఆధారంగా అమాయక ప్రజలను చంపడం ఇస్లాంకు మాత్రమే కాదు.. మానవత్వానికి కూడా విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో జూహూర్, మైనొద్దీన్, తహర్, నహీంపాషా, ఖాజమియా, మైపాషా, మున్వర్, అన్వర్ పాల్గొన్నారు.

### కేసముద్రంలో..

కేసముద్రం, ఏప్రిల్ 25 : పహల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా మండల కేంద్రంలోని జమ్మూ నమాజ్‌లో ముస్లింలు నల్ల రిబ్బన్లతో నమాజ్ చేశారు. ఉగ్రదాడి బాధాకరమైన ఘటన అని అన్నా రు. ఈ కార్యక్రమంలో మసీద్ ఎ రెహమాన్యా కమిటీ అధ్యక్షుడు రఫీఖాన్, మైనారిటీ మతపెద్దలు రజాక్, హశం, అమీర్, నైమొద్దీన్, షబ్బీర్, నవాజ్, నూరి, హఫీజ్, గౌస్, నజీర్ పాల్గొన్నారు.

### డోర్నకల్ లో..

డోర్నకల్, ఏప్రిల్ 25: జమ్ము కశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ శుక్రవారం డోర్నకల్ గాంధీ సెంటర్‌లో ముస్లింలు మౌనం పాటించి నిరసన వ్యక్తం చేశారు. ఉగ్ర దాడి హేయమైన చర్య అని, దీన్ని అందరూ ఖండించాలన్నారు. ఇలాం టి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

### ఉగ్రదాడిని ఖండిస్తూ ఉపాధ్యాయుల ర్యాలీ

తొర్రూరు : ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శుక్రవారం తొర్రూరు పట్టణంలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించాయి. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘల నాయకులు పాల్గొన్నారు.

### గార్లలో..

గార్ల : ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శుక్రవారం జమామసీదు వద్ద ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో షఫీయుద్దీన్, షేక్ బుడాన్, మహ్మద్, యాకూబ్ జానీ, పాల్గొన్నారు.



కేసముద్రం: నల్లరిబ్బన్లతో నమాజ్ చేస్తున్న ముస్లింలు



నర్సింహులపేట: నల్లబ్యాడ్జీలతో..



గార్ల : మసీదు వద్ద నల్లబ్యాడ్జీలతో ముస్లింలు



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

## క్షేత్రస్థాయిలోనే భూ సమస్యల పరిష్కారం

### కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

కేసముద్రం, ఏప్రిల్ 25 : భూభారతి చట్టం ద్వారా క్షేత్రస్థాయిలోనే భూసమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో సమస్య క్లిష్టత ఆధారంగా అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాల్లో పడిన తప్పులను సవరించుకోవడానికి ఈ చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. సాదాబైనామాలకు సైతం ఈ చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. త్వరలో ప్రభుత్వం గ్రామ పాలనా అధికారులను నియమిస్తుందన్నారు. అనంతరం ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, రెవెన్యూ డివిజన్ అధికారి కృష్ణవేణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, ఏడీసీ శ్రీనివాస్, ఏడీ సర్వే ల్యాండ్ నరసింహమూర్తి, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నారాణి, తహసీల్దార్ ఎర్రయ్య, ఎంపీడీవో క్రాంతి పాల్గొన్నారు.

### భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

మహబూబాబాద్ రూరల్ : భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం పట్టణ శివారు ఏటిగడ్డతండా రైతు వేదికలో భూ భారతి చట్టంపై ఎమ్మెల్యే మురళీనాయక్‌తో కలిసి ఆయన రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా భూ భారతి చట్టాన్ని తెలంగాణ రాష్ట్రంలో తీసుకురావడం జరిగిందని, దీని ద్వారా రైతుల భూ సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, ఏడీ నరసింహమూర్తి, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మహబూబాబాద్ రూరల్ :రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మండల శివారులో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామం వేపచెట్టుతండాకు చెందిన హలావత్ మోహన్ (31) పట్టణంలో కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున తమ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా, అమనగల్ గ్రామం వద్ద చీకట్లో అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. మోహన్‌కు భార్య భారతి, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

### డోర్నకల్ లో ఉరేసుకొని మరొకరు..

డోర్నకల్: ఉరేసుకొని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెన్నారం గ్రామంలో శుక్రవారం జరిగింది. ఏఎస్సై కోటేశ్వరావు కథనం ప్రకారం.. వెన్నారం గ్రామానికి చెందిన పీ నాగన్న (55) భార్య 5నెలల క్రితం మృతి చెందింది. దీంతో నాగన్న మనస్తాపానికి గురై జీవితంపై విరక్తితో మద్యం తాగి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. అతడి కూతురు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### కేసముద్రంలో రైలు కింద పడి..

కేసముద్రం,ఏప్రిల్ 25 : రైలుకింద పడి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం రాత్రి జరిగింది. రైల్వేహెడ్ కానిస్టేబుల్ భాస్కర్ కథనం ప్రకారం.. సోమవారం రాత్రి కేసముద్రం, తాళ్లపూసపల్లి మధ్య నవజీవన ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి బానోత్ రమేశ్(36)ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇనుగుర్తి మండలం తార్‌సింగ్ తండా జీపీ పరిధి కాశీరాంతండాగా వాసిగా గుర్తించారు. అతడికి భార్య సునీత, కూతురు నవీనశ్రీ, కొడుకు కౌశిక్ ఉన్నారు. కుటుంబ కలహాలు, అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తండావాసులు తెలిపారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెండ్

మరిపెడ, ఏప్రిల్ 25 : మండలంలోని ఎల్లంపేట ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ఐనాల మైసయ్యను సస్పెండ్ చేసినట్లు శుక్రవారం ఎంపీడీవో విజయ తెలిపారు. గ్రామంలో ఉపాధి పనుల్లో అవకతవకలు జరగడంతో డీఆర్డీవో మధుసూదనరాజు ఆదేశాల మేరకు ఎంపీడీవో విచారణ చేపట్టి నివేదికను అందజేశారు. అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో ఫీల్డ్‌అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించినట్లు వెల్లడించారు.

## ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బదిలీ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 25 : జిల్లా కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తించిన తిరుపతి మేడ్చల్ జిల్లా కోర్టుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు నుంచి స్వాతి మురారి రానున్నారు. జిల్లా కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న మౌనిక ఆదిలాబాద్ జిల్లా కోర్టుకు బదిలీ కాగా, ఆమె స్థానంలో సిద్దిపేట కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న కృష్ణతేజ్ రానున్నారు.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

కేసముద్రం, ఏప్రిల్ 25 : చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి అన్నారు. మండల కేంద్రంలోని ఉప్పరపెల్లి రోడ్డులో బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు గుగులోత్ వీరూనాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో వాహనదారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ధన్నసరి మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ నెహ్రూరెడ్డి, సట్ల నర్సయ్య, విరోద్, రాజు, టౌన్ మాజీ ఉపసర్పంచ్ భద్రూనాయక్, రాజేశ్, రుద్ర, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మే డే పోస్టర్ ఆవిష్కరణ..

తొర్రూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని గంటల పెంపునకు కుట్ర చేస్తున్నాయని టీయూసీఐ జిల్లా కోశాధికారి కే సంపత్ అన్నారు. శుక్రవారం తొర్రూరులోని అమరవీరుల స్తూపం వద్ద మే డే పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించిన 8 గంటల పని హక్కును భవిష్యత్‌లో 12 గంటలుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో అరవపల్లి వెంకన్న, మంగళపల్లి రామస్వామి, మాచర్ల మురళి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఆందోళన

డోర్నకల్ : పట్టణంలోని ఇందిరమ్మ కమిటీ సభ్యులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. మున్సిపల్ అధికారులు ఇందిరమ్మ కమిటీకి తెలియకుండా ఫైనల్ లిస్టును తయారు చేశారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు అందకుండా అవకతవకలు జరుగుతున్నాయని, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు ఖాదర్‌బాబా, ప్రదీప్, మహేశ్, అస్పాక్ పాల్గొన్నారు.



డోర్నకల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఇందిరమ్మ కమిటీ సభ్యులు